ఈ మాసం.. వీధి వ్యాపారులదే..!

జిల్లాలో జరగనున్న లోక్ కల్యాణ్ మేళాలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : సెప్టెంబరు నెల వీధి వ్యాపారులకు ప్రత్యేకంగా నిలుస్తోంది. ఈ నెలలో వీధి వ్యాపారులకు రుణాలు అందించేందుకు, సామాజిక భద్రత కల్పించేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ లోక్ కల్యాణ్ మేళాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే వీరికి పీఎం స్వనిధిలో రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు రుణాలు అందిస్తారు. డిజిటల్ చెల్లింపులపై శిక్షణ అందించి ఈ పోస్ యంత్రాలు సమకూరుస్తున్నారు. ఎఫ్ఎస్ఎస్ఐ సహకారంతో వీధి వ్యాపారులకు శుభ్రత, ఆహార భద్ర తలపైనా శిక్షణ అందిస్తున్నారు. వీరి ద్వారా ప్రజలకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించేందుకు మెప్మా కృషి చేస్తోంది. రూ.30 వేల నగదు పరిమితితో క్రెడిట్ కార్డులు సైతం వీరికి అందజేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ తరుణంలోనే లోక్ కల్యాణ్ మేళాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

జిల్లాలో ఇలా.. వీధి వ్యాపారులకు ప్రత్యేక మాసంగా పరిగణిస్తున్న సెప్టెంబర్‌లో లోక్ కల్యాణ్ మేళాలు జిల్లాలోని వివిధ పట్టణాల్లో నిర్వహించనున్నారు. ఈ మేళాలో రుణాలకు కొత్త దరఖాస్తులు తీసుకోవడంతోపాటు ఆరోగ్య శిబిరాలు జరుగుతాయి. వ్యాపారులకు వైద్య సేవలు అందిస్తారు. రుణాలు పంపిణీ చేస్తారు. నూజివీడులో ఈ నెల 10న స్థానిక స్త్రీశక్తి భవన్‌లో లోక్ కల్యాణ్ మేళా జరుగుతుంది. ద్వారకాతిరుమలలో ఈ నెల 15న ఎంపీడీవో కార్యాలయం వద్ద మేళా ఉంటుంది. జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్‌లో ఈ నెల 24న లోక్ కల్యాణ్ మేళా జరుగుతుంది. ఏలూరు కార్పొరేషన్‌లో ఈ నెల 25న గాంధీ విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తారు. వీటిని వ్యాపారులు వినియోగించుకోవాలని మెప్మా పీడీ రాజాబాబు కోరారు.

40 ఏళ్లకు కలిసి.. జ్ఞాపకాలతో మురిసి..

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఏలూరులోని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో నాలుగు దశాబ్దాల క్రితం వ్యాయామ విద్యలో శిక్షణ పొందిన పూర్వ విద్యార్థులంతా ఆదివారం రాజధాని అమరావతి పరిధిలోని కృష్ణా కరకట్ట వద్ద కలిశారు. శిక్షణ కాలంలో జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి 70 మంది పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు. ప్రస్తుతం ఎవరెవరు ఎక్కడ ఉంటున్నారో పరిచయం చేసుకుని ఉత్సాహంగా గడిపారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda 119

బ్యాంక్ ఆఫ్ బరోడా
గవరవరం బ్రాంచ్
హెచ్.నెం. 27-1-36/3, అమీనాపేట, ఏలూరు - 534 006, ఏలూరు జిల్లా.
ఫోన్: 08812-251722, ఇ-మెయిల్: gavara@bankofbaroda.com, www.bankofbaroda.com

(Appendix-IV) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(1) ప్రకారం

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (54 ఆఫ్ 2002) ప్రకారము **బ్యాంక్ ఆఫ్ బరోడా, గవరవరం బ్రాంచ్,** విజయవాడ యొక్క అధీకృత అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 9 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: శ్రీ నువ్వుల దినేష్ కుమార్, తండ్రి: శ్రీ రాధా కృష్ణ చౌదరి నువ్వుల,** విల్లా నెం.144, మా విల్లాస్, రోడ్ నెం: 1, కౌన్సల్ కాలనీ, వోల్వో బస్ సర్వీస్ సెంటర్ దగ్గర, బాచుపల్లి, మేడ్చల్-500090 వారు **చెల్లించవలసిన బకాయి రూ.83,29,745.74/- (అక్షరాల ఎనభై మూడు లక్షల ఇరవై తొమ్మిది వేల ఏడు వందల నలభై ఐదు రూపాయల డెబ్బై నాలుగు పైసలు మాత్రమే) + తేది 30-03-2026 నుండి వర్తించని వడ్డీ మరియు చట్టపరమైన, ఇతర ఛార్జీలతో కలిపి** మొత్తమును సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా కోరుతూ **తేది.31.03.2026న డిమాండ్ నోటీసును జారీచేసినారు.**

ఋణగ్రహీత/తనఖాదారు సదరు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు చట్టం నందలి రూల్ 8 ప్రకారం దిగువ వివరించిన ఆస్తిని **తేది.02.09.2026 న** స్వాధీనత తీసుకోవడమైనదని ఋణగ్రహీత/తనఖాదారు & యావన్మంది ప్రజానీకమునకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత/తనఖాదారు మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **బ్యాంక్ ఆఫ్ బరోడా, గవరవరం బ్రాంచ్,** విజయవాడ వారికి చెల్లించవలిసిన బకాయి మొత్తం **రూ.83,29,745.74/- (అక్షరాల ఎనభై మూడు లక్షల ఇరవై తొమ్మిది వేల ఏడు వందల నలభై ఐదు రూపాయలు మరియు డెబ్బై నాలుగు పైసలు మాత్రమే) + తేది 30-03-2026 నుండి వర్తించని వడ్డీ** మరియు వడ్డీ, చట్టపరమైన మరియు ఇతర ఛార్జీలు ఏమైనా ఉన్నచో మొత్తమునకు లోబడివుంటాయి.

ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు) తమ సెక్యూర్డ్ ఆస్తి విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(8) లోని నిబంధనలు గమనించవలెను.

స్థిరాస్తి వివరములు:

ఆస్తి నెం.1: ఐటమ్ నెం.1: ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, శనివరపుపేట గ్రామపంచాయతీ, గవరవరం గ్రామం, శాతవాహన నగర్, ప్లాట్ నెం. 15 & 16, ఆర్.యస్.నెం. 18/2A1 లో 898.00 చ॥గ॥ల నందు అవిభాజ్యపు విస్తీర్ణం 35.92 చ॥గ॥లు. **హద్దులు: తూర్పు:** రోడ్డు, **పడమర:** చలసాని ప్రజల యొక్క ఆస్తి, **ఉత్తరం:** బొండలపాటి వెంకట రమాదేవి మరియు ఇతరుల యొక్క ఆస్తులు, **దక్షిణం:** రోడ్డు.

ఐటమ్ నెం.2: డోర్ నెం. 12-81, బాలాజీ రెసిడెన్సీ నాలుగవ అంతస్తులో 930 చ॥అ॥ల విస్తీర్ణం కలిగిన ఫ్లాట్ నెం. 503. **హద్దులు: తూర్పు:** ఉమ్మడి మెట్లు, **పడమర:** ఫ్లాట్ నెం. 504 పి వి శ్రీనివాస రావు గారికి చెందినది, **ఉత్తరం:** ఉమ్మడి వరండా, **దక్షిణం:** శూన్యాకాశం.

ఆస్తి నెం.2: ఐటమ్ నెం.1: ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా, ఏలూరు, ఏలూరు మున్సిపాలిటీ, మిని బైపాస్ రోడ్డు, 22వ డివిజన్, పోస్టల్ కాలనీ, డోర్ నెం. 27-24-8A, టి.యస్.నెం. 113 లో 600.00 చ॥గ॥ల నందు అవిభాజ్యపు విస్తీర్ణం 50.00 చ॥గ॥లు. **హద్దులు: తూర్పు:** రోడ్డు, **పడమర:** శంకర వెంకట సుబ్రహ్మణ్య రంగారావు యొక్క స్థలం, **ఉత్తరం:** హేలాపురి బ్రాహ్మణ కల్యాణ మండపం యొక్క ఆస్తి, **దక్షిణం:** ఇతరుల స్థలం.

ఐటమ్ నెం.2: శ్రీ ధారి రెసిడెన్సీ నాలుగవ అంతస్తులో 1500 చ॥అ॥ల విస్తీర్ణం కలిగిన ఫ్లాట్ నెం. 501 + స్టిల్ట్ ఫ్లోర్‌లో 100 చ॥అ॥ల కార్ పార్కింగ్, మొత్తం విస్తీర్ణం 1600 చ॥అ॥లు. **హద్దులు: తూర్పు:** శూన్యాకాశం, **పడమర:** ఉమ్మడి వరండా, **ఉత్తరం:** శూన్యాకాశం, **దక్షిణం:** శూన్యాకాశం.

ఆస్తి నెం.3: ఐటమ్ నెం.1: ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, శనివరపుపేట గ్రామపంచాయతీ, గవరవరం గ్రామం, శాతవాహన నగర్, ప్లాట్ నెం. 15 & 16, ఆర్.యస్.నెం. 18/2A1 లో 898.00 చ॥గ॥ల నందు అవిభాజ్యపు విస్తీర్ణం 35.92 చ॥గ॥లు. **హద్దులు: తూర్పు:** రోడ్డు, **పడమర:** చౌదరి గారికి చెందిన భూమి, **ఉత్తరం:** బి.వి. రమాదేవి మరియు ఇతరుల ఆస్తులు, **దక్షిణం:** రోడ్డు.

ఐటమ్ నెం. 2: బాలాజీ రెసిడెన్సీ గ్రౌండ్ ఫ్లోర్‌లో 930 చ॥అ॥ల విస్తీర్ణం కలిగిన ఫ్లాట్ నెం. 104. **హద్దులు: తూర్పు:** ఫ్లాట్ నెం. 103, **పడమర:** ఫ్లాట్ నెం. 105, **ఉత్తరం:** వరండా, **దక్షిణం:** బాల్కనీ.

తేది : 02.09.2026 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: గవరవరం బ్యాంక్ ఆఫ్ బరోడా

ఆడేస్తాం.. గెలిచేస్తాం..

వివిధ క్రీడాంశాల్లో రాణిస్తున్న గురుకుల బాలురు

పెదవేగి (పెదపాడు), న్యూస్‌టుడే: ఆ విద్యార్థులు ఇంటికి దూరంగా ఉంటున్నారు. గురుకులంలో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నారు. ఓవైపు చదువులో రాణిస్తూనే.. మరోవైపు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. వ్యాయామోపాధ్యాయుల ప్రోత్సాహంతో ప్రతిరోజు సాయంత్రం వేళ ప్రత్యేక సాధన చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి.. జాతీయ స్థాయిలో విజయ దుందుభి మోగించేందుకు కఠోరంగా శ్రమిస్తున్నారు. పెదవేగి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల క్రీడాకారులపై కథనం.

జాతీయ జట్టులో స్థానమే లక్ష్యం

నా పేరు సీహెచ్ చెన్నారావు. ఇంటర్మీడియేట్ చదువుతున్నా. చిన్నప్పటి నుంచి ఖోఖో ఆటంటే ఇష్టం. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచా. దాదాపు అన్ని పోటీల్లోనూ ప్రథమ స్థానం సాధించి పతకాలు కైవసం చేసుకున్నా. భారత జట్టులో స్థానమే లక్ష్యంగా శ్రమిస్తున్నా. ఇటీవల అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ పాల్గొని మన్ననలు అందుకున్నా.

నాలుగేళ్లుగా శిక్షణ

మా పేరు జి. హర్షకుమార్. ఇంటర్ రెండో సంవత్సరం అభ్యసిస్తున్నా. నాలుగేళ్లుగా కబడ్డీలో శిక్షణ పొందుతున్నా. గతేడాది పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించా. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు కైవసం చేసుకున్నా. భారత జట్టులో స్థానం సంపాదించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నా.

శిక్షకుడిగా ఎదగాలని..

నా పేరు ఎం. రమేశ్. ఇంటర్ చదువుతున్నా. యోగాలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సొంతం చేసుకున్నా. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో సత్తా చాటి కాంస్య పతకం సాధించా. యోగాలో జాతీయ స్థాయి శిక్షకుడిగా ఎదగాలన్న ధ్యేయంగా ముందుకు సాగుతున్నా.

క్రీడా కోటాలో..

నా పేరు ఎం. అఖిల్. ఇంటర్మీడియేట్ చదువుతున్నా. నాకు చిన్నతనం నుంచే ఖోఖో ఆటంటే మక్కువ. గతేడాది పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించా. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఖోఖోలో జాతీయ స్థాయిలో రాణించాలన్నది ధ్యేయం. క్రీడా కోటాలో ఎంబీబీఎస్ చదివి వైద్యుడిగా స్థిరపడాలన్నది జీవితాశయం.

నేత్రపర్వంగా శివ కల్యాణం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడైన భ్రమరాంబ మల్లేశ్వర స్వామి కల్యాణం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లను ఆలయ ముఖ మండపంలో కల్యాణ మూర్తులుగా కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ క్రతువును ప్రారంభించారు. ముహూర్త సమయంలో జీలకర్ర, బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

ద్వారకాతిరుమలలో జపనీస్ యూట్యూబర్ ఫూటా

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల భ్రమరాంబమల్లేశ్వరస్వామి ఆలయంలో జపనీస్ యూట్యూబర్ ఫూటా ఆదివారం సందడి చేశారు. ముందుగా ఆయన స్వామిని దర్శించుకున్నారు. అనంతరం శివాలయం గోపురం మెట్లపై రీల్స్ చేస్తూ సందడి చేశారు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఆయన సంప్రదాయ దుస్తులు ధరించి తెలుగులో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు.

ఆదివారం.. ఆరోగ్య కేంద్రం.. అయోమయం

రోగికి చికిత్స అందిస్తున్న వైద్యురాలు

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తరచూ సిబ్బంది ఉండకపోవడంతో చికిత్స చేయించుకునేందుకు వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఆదివారం ఆసుపత్రిని పరిశీలించగా వైద్యురాలు, స్టాఫ్ నర్స్ మినహా ఎవరూ విధులకు హాజరు కాలేదు. దీంతో రోగులు చేసేదేమి లేక ప్రైవేటు ఆసుపత్రులకు వెనుదిరుగుతున్నారు. ఆదివారం సాయంత్రానికి ఓపీ 40 వరకు చేరుకుంది. రోగులకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్టాఫ్‌నర్స్ సావిత్రి, మధ్యాహ్నం నుంచి వైద్యురాలు ప్రవీణ ఆశాజ్యోతి చికిత్స చేయడం గమనార్హం. ప్రస్తుతం మండలంలో జ్వరాల ఉధృతి కూడా అధికంగానే ఉండి రోజుకు ఓపీ 80 వరకు చేరుకుని ఆసుపత్రి కిటకిటలాడుతోంది. అయినా సిబ్బంది మిగిలిన రోజుల్లో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రోగులకు ఇదో తలపోటుగా మారింది. అసలు ఆదివారం ఓఎస్, ఫీడర్ అంబులెన్స్, హెచ్‌వీ, ఏఎన్ఎం ఇలా నలుగురు విధులు నిర్వహించాల్సి ఉండగా వైద్యురాలు డ్యూటీలు వేశారు. ఏ ఒక్కరూ ఉన్నతాధికారుల అనుమతులు తీసుకోకుండానే విధులకు హాజరు కాలేదు. ప్రతి ఆదివారం ఆసుపత్రిలో ఇదే తంతు జరుగుతున్నట్లు రోగులు చెబుతున్నారు. అత్యవసర కేసులు వస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వైద్యురాలు ప్రవీణ ఆశాజ్యోతిని వివరణ కోరగా ఉన్నతాధికారులకు సమస్యపై నివేదించామని చెప్పారు.

ఐక్యత చాటుతున్న సంఘ నాయకులు

ఐక్యతతోనే హక్కుల సాధిద్దాం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యం సాధించి దశాబ్దాలు గడుస్తున్నా.. నేటికీ బీసీలు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నారని.. ఐక్యతతోనే హక్కుల సాధించుకోగలమని జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు యలగాల నూకాలమ్మ అన్నారు. స్థానిక లేడీస్ క్లబ్ సమావేశ మందిరంలో ఆదివారం రాత్రి బీసీ కులాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బీసీలు సమష్టిగా ముందుకెళ్లి అనుకున్నది సాధించాలని ఆర్టీసీ విజయవాడ ప్రాంతీయ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మన ఓటు మన కోసమే వేసుకోవాలని.. అన్ని రంగాల్లో పట్టు సాధించాలని వడ్డీల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి సూచించారు. స్థానిక ఎన్నికల్లో ఏలూరు మేయర్, జడ్పీ ఛైర్మన్ పీఠాలను బీసీలకు కేటాయించాలని సంఘ జిల్లా అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి డిమాండ్ చేశారు. సంఘ నాయకులు లంకా వెంకటేశ్వర్లు, విఠల్ కుమార్, ఆంజనేయులు, ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

తీర గ్రామాలకు అధిక ప్రాధాన్యం: నిమ్మల

పాలకొల్లు, న్యూస్‌టుడే: గోదావరి పరీవాహక ప్రాంతాల్లో అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. యలమంచిలి మండలం బాడవలో రూ.2.03కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన ఆదివారం సాయంత్రం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం విశాఖపట్నానికి చెందిన దేవి ఫిషరీస్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ.. గోదావరి వరద సమస్య నుంచి ఆయా గ్రామాలు బయట పడటానికి ప్రాధాన్యత ప్రకారం ప్రతిపాదనలు చేసి పనులు పూర్తి చేస్తున్నామన్నారు. ఏటిగట్టుపై బీటీ రోడ్డు, విజ్జేశ్వరం నుంచి పైపులైను ద్వారా తాగునీరు సరఫరా వంటి పనులు పూర్తిచేసి డెల్టా ప్రజలకు వసతులు కల్పిస్తున్నామన్నారు. రాయి శ్రీనివాస్, రాయి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీఏ బకాయిలన్నీ ఒకేసారి చెల్లించండి: ఏపీటీఎఫ్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సామాన్య ఉద్యోగి ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ ఉపశమనం కలిగించేలా త్వరగా పీఆర్సీ నియమించడంతోపాటు ప్రభుత్వం ప్రకటించిన డీఏ బకాయిలన్నింటినీ ఒకేసారి చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. నారాయణదాసు, తాళ్లూరి రామారావు విజ్ఞప్తి చేశారు. జేఏసీతో జరిగిన చర్చల్లో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు ప్రకటించడం హర్షణీయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం సలహాదారులు మాత్రమే నాయకులతో మాట్లాడేవారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా నాయకులతో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి నిర్ణయం తీసుకోవడం ఆహ్వానించదగ్గ విషయమని వారు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అట్టహాసంగా కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: నగరంలో ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్(సబ్కా) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గం గౌరవాధ్యక్షుడిగా ఇసుకపల్లి తాతారావు, అధ్యక్షుడిగా మోటేపల్లి చంద్రశేఖర్, సలహాదారులు ఎస్‌వీవీ రాంబాబు, పుప్పాల ముకుందరావు, బాపయ్య చౌదరి, అంగడాల సూరిబాబు నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా కె. తులసీరామ్, లంకపల్లి దుర్గాప్రసాద్, టి. విజయ్‌కుమార్, అండే వరప్రసాద్, కార్యదర్శిగా వి. రామ్‌ప్రసాద్, కోశాధికారిగా ఎల్. వెంకటరావు, సంయుక్త కార్యదర్శులుగా ఎస్ఎల్ నరసింహరెడ్డి, మైలవరపు శ్రీనివాసు, ఎం. సతీష్, ఎ. సూర్యచంద్రరావు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గుత్తేదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. రాష్ట్ర సమన్వయకర్త కె. శివకుమార్, సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య భగవానుడికి ప్రత్యేక అభిషేకాలు

పవరుపేట (ఏలూరు అధ్యాత్మికం), న్యూస్‌టుడే: పవరుపేటలోని సూర్యభగవానుడి ఆలయంలో ఆదివారం ప్రత్యేకాభిషేకాలు చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, తులసి మాలలు, వివిధ రకాల పుష్పాలతో నేత్రపర్వంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ ప్రదక్షిణ చేసి.. సూర్యనారాయణుడిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

మత్తు ఇంజెక్షన్ల విక్రయాల కేసులో.. ఏజెన్సీ నిర్వాహకుడి అరెస్టు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: మత్తు ఇంజెక్షన్లు అనధికారికంగా కొనుగోలు చేసి విక్రయిస్తున్న మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడిని జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెంలో డీఎస్పీ బీహెచ్ వెంకటేశ్వర్లు ఆదివారం మీడియా సమావేశాన్ని నిర్వహించి వివరాలు వెల్లడించారు. జంగారెడ్డిగూడెం సాయి సూర్యనగర్‌కు చెందిన కండ్రేగుల లక్ష్మణసాయి కిశోర్ గత కొంత కాలంగా స్థానికంగా శ్రీలక్ష్మీ శ్రీనివాస మెడికల్ ఏజెన్సీ నడుపుతున్నాడు. కాగా మంగళవారం మండలంలోని వేగవరం గ్రామంలోని ఓ పామాయిల్ తోటలో పదుల సంఖ్యలో ట్రైమడాల్ ఇంజెక్షన్లు ఉన్నాయని తెలియడంతో బుధవారం ఔషధ విభాగం, ఈగల్ బృందం పట్టణంలోని పలు మెడికల్ ఏజెన్సీలు, మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలోనే శ్రీలక్ష్మీ శ్రీనివాస మెడికల్ ఏజెన్సీలో తనిఖీలు చేయగా 20వేల మత్తు ఇంజెక్షన్లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. నిందితుడు లక్ష్మణసాయి కిశోర్ జంగారెడ్డిగూడెం డాంగేనగర్‌లోని ఓ ఉడ్ వర్క్స్ దుకాణంలో 4 అట్టపెట్టల్లో 7550 మత్తు ఇంజెక్షన్లు రహస్యంగా ఉంచినట్లు గుర్తించి వాటిని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బృందం స్వాధీనం చేసుకున్నారు. దీనిపై జంగారెడ్డిగూడెం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై ఎన్‌డీపీఎస్ యాక్టు కింద కేసు నమోదు చేసి శనివారం అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడు లక్ష్మణసాయి కిశోర్ ఒక్కో ఇంజెక్షన్‌ను రూ.5 కు కొనుగోలు చేసి వాటిని రూ.20 నుంచి రూ. 50 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని, అయితే మిగతా 12,450 ఇంజెక్షన్లు ఎవరికి విక్రయించారనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టినట్లు ఆయన చెప్పారు. నిందితుడు లక్ష్మణసాయి కిశోర్ వద్ద నుంచి చరవాణి స్వాధీనం చేసుకుని ఆదివారం న్యాయస్థానంలో హాజరుపర్చినట్లు డీఎస్పీ వెల్లడించారు. కార్యక్రమంలో సీఐ ఎంవీ సుభాశ్, ఎస్సై వీరప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై కుటుంబరావు, తడికలపూడి ఎస్సై వల్లీపద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా ఆమె సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుతో ముదినేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కాకరవాడకు చెందిన పి. వీరలక్ష్మి(35)కి కృష్ణా జిల్లా మొవ్వ మండలం పాలంకిపాడుకు చెందిన పామర్తి వాసుబాబుతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వివాహమైన నాటి నుంచి భర్తతో కలిసి కాకరవాడలోనే నివాసముంటున్న వీరలక్ష్మి శ్రీహరిపురంలోని ఓ కిరాణా దుకాణంలో పని చేస్తోంది. ఇటీవల వాసుబాబు అనారోగ్యం బారిన పడగా వైద్యం కోసం అప్పులు చేయాల్సి రావడంతో మనస్తాపానికి గురై ఈ నెల 5న ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించిందని వీరలక్ష్మి సోదరుడు ఎం. సుబ్బారావు ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానికులు సమాచారం అందించడంతో అపస్మారక స్థితిలో ఉన్న వీరలక్ష్మిని గుడివాడ.. అక్కడి నుంచి పెదఅవుటుపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ముదినేపల్లి ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బంధువుల ఆందోళన.. అయితే వీరలక్ష్మి ఆత్మహత్య యత్నానికి భిన్న కారణాలు వినిపిస్తున్నాయి. ఈమె మండలంలోని చేవూరుపాలేనికి చెందిన ఓ వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తి భార్య, సోదరి వీరలక్ష్మిపై ఇటీవల బహిరంగంగా దాడి చేశారని, ఇందుకు మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిందని ఆమె బంధువులు, గ్రామస్థులు ముదినేపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి ఆందో